క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



పెద్దమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని మాయలూరు గ్రామంలో పెద్దమ్మ తల్లికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 3న గ్రామంలో పెద్దమ్మ దేవర అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏడు రోజులు పూర్తయిన సందర్భంగా అమ్మవారికి చల్లదనం కార్యక్రమాలు చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సదస్సును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రాజునాయక్

నంద్యాల(అర్బన్): ఈనెల 14న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి గిరిజన మేధావుల సదస్సును విజయవంతం చేయాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ కోరారు. స్థానిక సమాఖ్య కార్యాలయ ఆవరణంలో మంగళవారం ఆయన సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు రవినాయక్, రవీంద్రనాయక్, శంకర్‌నాయక్, రామునాయక్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాన్యం కౌలు వేలం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ: మండల కేంద్రంలో వెలసిన శ్రీ అగస్త్యేశ్వర, కోదండ రామస్వామి ఆలయ భూముల కౌలుకు మంగళవారం వేలం నిర్వహించారు. 51.25 ఎకరాలను ఏడాది పాటు సాగు చేసుకునేందుకు రూ.1.80 లక్షలకు పాటపాడి ఓ రైతు దక్కించుకున్నాడని ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఈఓ చంద్రుడు, మాజీ ధర్మకర్తలు పోచా రాధాక్రిష్ణారెడ్డి, ఖాతా దస్తగిరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

ఉయ్యాలవాడ: ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి రమేష్‌చంద్రబాలాజీ సూచించారు. మంగళవారం సుద్దమల్ల గ్రామంలో 104 వాహనంలో వైద్య బృందం తరలివెళ్లి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 106 మందికి వివిధ రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. సాయంత్రం గృహాల వద్ద ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సునీల్‌బాబు, వెంకటేశ్వరి, ఏఎన్‌ఎమ్ జయమ్మ పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్

నంద్యాల(సిటీ): మున్సిపల్ పరిధిలోని 10, 12, 13, దేవనగర్–1, దేవనగర్–2 సచివాలయాలను మంగళవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తనిఖీ చేశారు. విధుల్లో అలసత్వం వహించరాదని సిబ్బందికి సూచించారు. ఎక్కడికెళ్లినా తప్పకుండా మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో సంతకం చేయాలన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

పిడుగుపాటుకు గుర్రం మృతి



మృతి చెందిన గుర్రం

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరులో పిడుగు పాటుకు గుర్రం మృతి చెందింది. మంగళవారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉండింది. సాయంత్రం అయ్యే సరికి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని భారీగా గాలులు వీస్తూ ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఈక్రమంలో పెద్దకంబలూరు ఎస్సీ కాలనీలో పిడుగు పడటంతో భూపాల్‌కు చెందిన గుర్రం అక్కడికక్కడే మృతి చెందింది.

జోరుగా.. హుషారుగా

- విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు
- ప్రతిభ వెలికి తీయడమే లక్ష్యంగా కళారాధన సంస్థ కృషి



భరత నాట్యం నేర్చుకుంటున్న విద్యార్థులు,



తైక్వాండో శిక్షణపొందుతున్న చిన్నారులు



చెస్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా కళారాధన సంస్థ పని చేస్తోంది. కొందరు ఉద్యోగులు, లయన్స్, రోటరీ, ఐఎంఏ సహకారంతో స్వచ్ఛందంగా పని చేసి ఈ సంస్థ జిల్లా వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా పేరు సంపాదించుకుంది. వేసవి సెలవుల్లో ప్రతిభ ఉన్న అధ్యాపకులచే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో సృజనశీలతను పెంచడమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు వేసవి లలిత కళల శిక్షణా శిబిరం జోరుగా, హుషారుగా సాగుతోంది.

కళారాధన సంస్థ, లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్, ఐఎంఏ సహకారంతో 2000లో అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ ప్రారంభించారు. అప్పటి నుంచి ఏటా మేలో వేసవి లలిత కళల శిక్షణ శిబిరం కొనసాగుతూ వస్తోంది. రామకృష్ణ విద్యాలయంలో జరిగే ఈ శిబిరాన్ని 2012లో నంద్యాల మున్సిపల్ హైస్కూల్‌కు మార్చారు. ఇందులో శిక్షణ పొందిన వారు ప్రస్తుతం ప్రైవేటు స్కూళ్లలో డ్యాన్స్ మాస్టర్లుగా, కోచ్‌లుగా రాణిస్తున్నారు.

900 మంది విద్యార్థులకు శిక్షణ..

మున్సిపల్ హైస్కూల్‌లో ఈ శిబిరం కొనసాగుతోంది. దాదాపు 900 మంది విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారు. 20 మంది కోచ్‌లు చదరంగం, ఆధునిక, శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, శారీ పెయింటింగ్, తైక్వాండో, శాస్త్రీయ సంగీతం, మిమిక్రీ, వాయిద్య సంగీతం, భగవద్గీత, తెలుగు పద్యాలు, కీబోర్డు, కబడ్డీ, కర్రసాము, డ్రాయింగ్, పెయింటింగ్, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

జూన్‌లో ప్రదర్శన..

ఈ వేసవి లలిత కళల శిక్షణ శిబిరం జూన్ 6న ముగియనుంది. ఇందులో ప్రతిభ చూపిన వారికి జూన్ మొదటి వారంలో టౌన్‌హాల్‌లో జరిగే కార్యక్రమంలో ప్రదర్శన ఇచ్చే అవకాశం కల్పిస్తారు. ఈ శిబిరానికి ఏటా ఆదరణ పెరుగుతుంది.

సేవలో తృప్తిగా ఉంది



14 ఏళ్ల నుంచి ఆధునిక నృత్యంలో శిక్షణ ఇస్తున్నాను. ఈ శిబిరంలో శిక్షణ పొందిన వారు కొందరు డ్యాన్స్ అకాడమీలను స్థాపించగా, మరికొందరు ప్రైవేట్ విద్యాసంస్థల్లో డ్యాన్స్ మాస్టర్లుగా ఉపాధి పొందుతున్నారు. ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో తృప్తిగా ఉంది.

– రాజాహుసేన్, డ్యాన్స్ మాస్టర్

తరగతులు బాగున్నాయి



ఆరేళ్ల నుంచి వేసవి లలిత కళల శిక్షణ శిబిరంలో నృత్యం నేర్చుకుంటున్నాను. ఎలాంటి ఫీజులేదు. మాకు అనుకూలమైన సమయంలోనే తరగతుల తీసుకుంటారు. తరగతులు కూడా బాగున్నాయి.

– గోవర్ధిని, శిక్షణ పొందుతున్న విద్యార్థిని

ఏటా పెరుగుతున్న ఆదరణ



కళారాధన సంస్థ పేద విద్యార్థులనే లక్ష్యంగా తీసుకొని వారి సృజనాత్మకతను, విజ్ఞానాన్ని వెలుగు తీయడం కోసం ఉచితంగా సేవలను అందిస్తుండటంతో ఏడాదికేడాది ఆదరణ పెరుగుతోంది. శిబిరంలో శిక్షణ పొందినంత మాత్రాన పూర్తిగా రాదు. కానీ చిన్నారుల్లో ఆసక్తి, సృజనాత్మకత, విజ్ఞానం పెంచడమే మా లక్ష్యం.

– డాక్టర్ రవికృష్ణ, కళారాధన ప్రధాన కార్యదర్శి

ఏపీఎం బదిలీ

ఉయ్యాలవాడ: స్థానిక వైఎస్సార్ ఇందిరా కాంతి పథం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏపీఎం శేఖర్ సంజామల మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కోవెలకుంట్ల ఏరియా కోఆర్డినేటర్ గురుస్వామిని ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ఆ శాఖ పీడీ జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం కార్యాలయానికి అందాయి.

ఆపన్నులకు అండగా శ్రీ నృసింహ సేవా వాహిని



భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న సభ్యులు

ఆళ్లగడ్డ: ఆపదలో ఉన్న పేదలకు శ్రీ నృసింహ సేవా వాహిని అండగా నిలుస్తోందని అహోబిలం ఆలయ ప్రధానార్చకులు శ్రీమాన్ శఠకోప వేణుగోపాలన్ స్వామి కొనియాడారు. అహోబిలంలో నృసింహ సేవావాహిని వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా వాహిని జిల్లా అధ్యక్షుడు రవికాంత్, సభ్యుడు ఉప్పల ప్రసాద్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోండి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

గోస్పాడు: గర్భిణులు రక్తహీనతతో బాధ పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి గోపాల్ సూచించారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల్లో మొదటి మూడు, నాలుగు నెలల సమయంలో వాంతులు, వికారం, కడుపునొప్పి, తలనొప్పి వంటి సమస్యల వల్ల సరైన ఆహారం తీసుకోలేరన్నారు. దీంతో రక్తహీనతతో బాధ పడుతుంటారన్నారు. సరైన సమయానికి పౌష్టికాహారం తీసుకోవాలని, ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లు కనిపిస్తే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి వారి సలహా మేరకే మందులు వాడాలని సూచించారు.

- **ఉయ్యాలవాడ:** మండలంలోని మాయలూరు, పెద్దయమ్మనూరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 51 మంది గర్భిణులకు వైద్యాధికారులు రాబర్ట్ కెనడీ, అశోక్, విజయదుర్గలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భం దాల్చిన 12 వారాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రక్తహీనత లోపం లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి సుఖప్రసవాలు జరిపించేందుకు, మాతా శిశుమరణాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

కలెక్టర్‌కు ఆహ్వానం



నంద్యాల(అర్బన్): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యాగానికి రావాలంటూ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. పత్రికను అందుకున్న కలెక్టర్ తప్పక హాజరవుతానని చెప్పారు.

వార్షికోత్సవ పూజలు ప్రారంభం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీగోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి, మహాత్రిపుర సుందరి మానస లింగేశ్వరస్వామి ఆలయాల వార్షికోత్సవ పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకులు మధుసూదన రెడ్డి, రంగనాయకులు, నరసింహులు ఆధ్వర్యంలో అర్చకులు వారణాసి గోపీశర్మ, వెల్లాల పుల్లయ్య, శివస్వామి పూజలను ప్రారంభించారు. మొదటి రోజున గణపతి పూజ, మహాన్యాస పారాయణం, మహా లింగార్చన, స్వామి వారికి రుద్రాభిషేకం, వివిధ రకాల హోమాలు చేశారు. అనంతరం మహా త్రిపుర సుందరి సమేత మానస లింగేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు.

800 లీటర్ల సారా ఊట ధ్వంసం



నల్లమలలో నాటుసారా బట్టీ వద్ద ఎస్‌ఐ, సిబ్బంది

మహానంది: నల్లమలలో నాటుసారా స్థావరాలపై మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ దృష్టి సారించారు. ఈ మేరకు రెండ్రోజుల నుంచి విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. తాజాగా మంగళవారం మహానంది గోశాల సమీపంలోని నల్లమల అడవిలో సిబ్బంది చంద్రశేఖర్, శేషులతో కలిసి మఫ్టీలో మరోసారి దాడులు చేశారు. సారా బట్టీ నిర్వాహకులు సురసుర భూపాల్, ఆయన కుమారుడు శ్రీకాంత్ నిర్వహిస్తున్న బట్టీపై దాడులు చేసి 800లీటర్ల ఊటను ధ్వంసం చేసి, 30లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులు ఇద్దరూ పరారు కాగా కూలీకి వెళ్లిన మండ్ల నరసింహులును పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మహానందిలోని ఈశ్వర్‌నగర్, పార్వతీపురం కాలనీల్లో సుమారు 20 మందికి పైగా సారా విక్రేతులు ఉన్నట్లు సమాచారం.

అక్రమ మద్యం స్వాధీనం

మిడుతూరు: మండలపరిధిలోని అలగనూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని 37 క్వార్టర్ బాటిల్స్, 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మారుతిశంకర్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు అలగనూరు గ్రామానికి చెందిన పులివెందుల లక్ష్మన్న గౌడు తన ద్వి చక్రవాహనంపై 30 ఓల్డ్ అడ్మిరల్, 07 మాన్సన్ హౌస్ క్వార్టర్ బాటిల్స్, 5 లీటర్ల సారా తరలిస్తుండగా మిడుతూరు విద్యుత్ ఉపకేంద్రం వద్ద అతనిని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

సమస్యల పరిష్కార వేదిక ‘జగనన్నకు చెబుదాం

నంద్యాల(సిటీ): ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం మంచి వేదిక అని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, ఆర్‌ఓ వరప్రసాద్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, పోలీసు అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న లబ్ధిదారులు టోల్‌ఫ్రీ నంబర్ 1902కు ఫోన్ చేసి ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు సమయంలో ప్రతి ఒక్కరికీ వైఎస్‌ఆర్ ఐడీని కేటాయిస్తారని, దాని ప్రకారం సమస్య పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. ప్రతి దశలో ఫిర్యాదుదారుడి సెల్‌కు మెస్సేజ్ వస్తుందని, చివరిలో సమస్య పరిష్కారమైతే లబ్ధిదారుడు తన సంతృప్తి తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహానందిలో భక్తుల సందడి



మహానందీశ్వరున్ని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: వేసవిసెలవులు ఉండటంతో మహానంది ఆలయం భక్తులరద్దీతో నిత్యం కళకళలాడుతోంది. ఈ మేరకు మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేసవి రద్దీ దృష్ట్యా ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా దర్శనం కల్పిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక శ్రీ సంకల్ప్ ఒలంపియాడ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన చెస్ పోటీలను చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9, 11 ఏళ్ల బాలబాలికలకు ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ కనబరిచిన 9ఏళ్లలోపు బాలబాలికలు కృష్ణా జిల్లాలో, 11ఏళ్లలోపు బాలబాలికలు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మహాకుంభాభిషేకానికి ఉప ముఖ్యమంత్రికి ఆహ్వానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మహాకుంభాభిషేక మహోత్సవానికి హాజరుకావాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి , దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను మంగళవారం ఆహ్వానించారు. మంగళవారం ఈఓ ఎస్ లవన్న, సహాయ కార్యనిర్వాహణాధికారి హరిదాసు, శ్రీశైల ప్రభ సంపాదకులు అనీల్‌కుమార్, వేదపండితులు గంటి రాధాకృష్ణమూర్తి తదితరులు విజయవాడ వెళ్లి మహాకుంభాభిషేకానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేదపండితులు ఉపముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించారు. అలాగే స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, పీజీ కోర్సులు పూర్తి చేసినా ఉద్యోగం పొందలేకపోతున్న యువతలకు ఉచిత శిక్షణ, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు కోర్స్ డైరెక్టర్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఆర్‌ఎస్ అధికారి బి.యాదగిరి, అమీలియో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ పినాక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, జీకే, గ్రూప్స్, సివిల్ గైడెన్స్ కోర్సులలో 21 రోజుల పాటు ఉచితంగా కర్నూలు నగరంలోని సాయి సుబ్బయ్య రవీంద్ర హైస్కూల్ (బిషప్ చర్చి–నంద్యాల చెక్‌పోస్టు)లో శిక్షణ ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు 91777 64147, 63010 95744 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి జీలుగ విత్తనాల పంపిణీ

మహానంది: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు జీలుగ విత్తనాలను సబ్సిడీ ధరలపై పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మహానంది మండలానికి 350 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరయ్యాయన్నారు. కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో పాసుపుస్తకం, ఆధార్‌కార్డులతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. క్వింటా జీలుగ విత్తనాల పూర్తి ధర రూ.7,900 ఉందని, సబ్సిడీతో రూ. 3,950కి అందిస్తారన్నారు. రైతులకు ఎకరాలకు పది కిలోల చొప్పున ఐదు ఎకరాలు ఉన్న రైతుకు 50 కిలోలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మహానంది మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 8,500 ఎకరాల వరి సాగవుతుందన్నారు. భూసారం తగ్గిపోతున్న నేటి రోజుల్లో జీలుగవిత్తనాలను నేలలో కలియదున్నడం వలన భూసారం పెరుగుతుందన్నారు.

మహానందిలో వర్షం

మహానంది: ఆలయ పరిసరాల్లో మంగళవారం మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో వర్షం కురిసింది. వరుసగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పుష్కరిణిలో స్నానం చేసే భక్తులు వేసవితాపం తీర్చుకోవడంతో పాటు వర్షం రావడంతో అమితానందం వ్యక్తం చేస్తూ సేదతీరారు.

హోరాహోరీగా గార్ధబాల పరుగు పందెం



గార్ధబాలపరుగుపందెం పోటీలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన గార్ధబాల పరుగుపందెం పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఎనబైపళ్ల ఇసుక మూట బరువుతో పది నిమిషాల కాల వ్యవధిలో నిర్వహించిన పోటీల్లో జిల్లాతోపాటు వైఎస్సార్ జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది గార్ధబాలు పోటీల్లో పాల్గొన్నాయి.

వైఎస్సార్ జిల్లా పెద్ద ముడియం మండలం జంగాలపల్లెకు చెందిన అంజి గార్ధభం ప్రథమ స్థానంలో నిలిచి రూ. 10వేలు బహుమతి కైవసం చేసుకుంది. ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి నాగ వైష్ణవి గార్ధబం ద్వితీయ స్థానంలో రూ. 5వేలు, అవుకు మండలం మెట్టుపల్లెకు చెందిన పెద్దయ్య గార్ధబం తృతీయ స్థానంలో రూ. 3వేలు దక్కించుకున్నాయి. వెలగటూరు గ్రామ సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి, పట్టణానికి చెందిన చాకలి శ్రీనివాసులు, నాగేంద్ర, పుల్లయ్య ఆర్థిక సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు.

ప్రజా వినతుల పరిష్కారంలో చొరవ చూపాలి

మహానంది: ప్రజా వినతుల పరిష్కారంలో వివిధ శాఖల అధికారులు చొరవ చూపాలని తహసీల్దార్ జనార్దన్‌శెట్టి ఆదేశించారు. తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ శాఖల వారిగా సిబ్బంది సమన్వయంతో పనిచేసి సీఎం జగన్ ఆశయాలను నెరవేర్చాలన్నారు. దీంతో పాటు బుక్కాపురంలోని సచివాలయంలో వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, తిమ్మాపురంలో సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

బిందుసేద్యంతో అరటిలో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

మహానంది: బిందుసేద్యం పరికరాలు ఉపయోగించి అరటి పంటలను సాగు చేయడం ద్వారా ఆశించిన మేరకు రైతులు లాభాలు పొందవచ్చని ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. గాజులపల్లెలో మంగళవారం బిందుసేద్యం సాగు, మార్కెటింగ్, యాజమాన్య పద్ధతులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రిప్ పరికరాల ద్వారా అరటి మొక్కలకు తగినంత నీరు సమృద్ధిగా అందుతుందన్నారు. అలాగే నేటి ఆధునిక సాంకేతిక కాలంలో రైతులు పంటల సాగుతో పాటు మార్కెటింగ్‌లో నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. అకాల వర్షాల వలన పంటలను పూర్తిగా నష్టపోకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో ఎరువులు, సూక్ష్మపోషకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు తమ అనుభవాలకు తోడు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం యంత్రసేవా పథకం ద్వారా సాంకేతిక పరికరాలను అందిస్తుందని, వాటిని వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు నాగేశ్వరరెడ్డి, శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నేత కొండా మధుసూదన్‌రెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్లు పల్లవి, ఇంద్రాణి, హరిత పాల్గొన్నారు.

ఆలయ పరిసరాల్లో మద్యం సేవిస్తే జైలుకే

మహానంది: మహానంది దేవస్థానం పరిసరాల్లో మద్యం సేవిస్తే కటకటాలు తప్పవని ఎస్‌ఐ జి. నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి ఆయన మాట్లాడుతూ గత రెండ్రోజుల వ్యవధిలో స్థానిక వైన్‌షాపు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పది మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వాహనాల్లో, లాడ్జీల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడటం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అవుకు: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం మంగళవారం ప్రారంభమైందని ప్రిన్సిపల్ నాగసుబ్బరాయుడు తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివిన విద్యార్థులు ఉండాలన్నారు. అలాగే ఓసీ, బీసీ విద్యార్థులు 01-09-2011 నుంచి 31-08-2013 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2009 నుంచి 31-08-2013 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 రుసుం చెల్లించాల్సి ఉంటుందని, నెట్‌సెంటర్, మీ సేవా కేంద్రాల్లో ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తు కాపీతో పాటు ఆధార్, కులధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు అవుకు ఆదర్శ పాఠశాలకు అందజేయాలని తెలిపారు.